ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 18 సెప్టెంబరు 2025





ములుగు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మంత్రి సీతక్క

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నాం
- మహిళలకు అత్యంత ప్రాధాన్యం
- పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ప్రజా పరిపాలన దినోత్సవంలో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అధిక నిధులు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ టి.ఎస్.దివాకర అధ్యక్షతన బుధవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబరు 17కు ఒక విశిష్టత ఉందన్నారు. 77సంవత్సరాల క్రితం మన తెలుగు రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగంగా మారిందని, రాచరిక పరిపాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో రెండింటిని ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48గంటల్లోనే అమలు ప్రారంభించి చరిత్ర సృష్టించిందని అన్నారు. ఆడబిడ్డలకు తొలి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించగానికి మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని, ఇప్పటి వరకు కోటి40 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైనవైద్యం పొందేందుకు చికిత్సల పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందని అన్నారు. అదేవిధంగా రూ.500కే వంట గ్యాస్ అందజేస్తోందని తెలిపారు. జిల్లాలో 8,968 కొత్త రేషన్‌కార్డులను జారీ చేశామన్నారు. గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని అన్నారు. విద్యావ్యవస్థలో నూతన మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నామని, ఇందులో పాఠశాలలు మొదలుకుని విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తామని అన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్

ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఇందిర మహిళాశక్తి పథకం కింద శ్రీనిధి ఏర్పాటుచేసి బ్యాంకులతో అనుసంధానం ద్వారా మహిళలకు రూ.లక్ష కోట్ల ఆర్థిక సాయాన్ని అందించాలనే లక్ష్యంతో మహిళాశక్తి క్యాంటీన్‌లు, డెయిరీ, మీ-సేవతదితర వ్యాపారాలను గ్రౌండింగ్ చేసినట్టు (మిగతా 8వ పేజీలో)



వేదికపై గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సీతక్క



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్



మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజల ఆలోచనే సర్కారు ఆచరణ
- తెలంగాణ త్యాగధనులు చిరస్మరణీయులు
- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్
- భూపాలపల్లి కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు కోట్ల మంది ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కోసం మహనీయులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజలే తెలంగాణ ప్రస్థానానికి నావికులని, వారి ఆలోచనలే రాష్ట్ర ప్రభుత్వ ఆచరణ అని అన్నారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు చరమగీతం పాడి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం సెప్టెంబర్ 17న ఆవిష్కృతమైందన్నారు. రాష్ట్ర ప్రజలు ఆత్మగౌరవం కోసం రాజరిక పోకడపై చేసిన తిరుగుబాటు అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో తమ బాధలు తీరుతాయనుకున్న ప్రజల ఆశలు గడిచిన పదేళ్లల్లో నెరవేరలేదన్నారు. ప్రభుత్వ ఆలోచన, ఆచరణ ప్రతిదీ ప్రజాకోణమేనని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ శుభదినాన్ని ప్రజాపాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పాలన పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉండాలన్నదే రేవంత్‌రెడ్డి దృక్పథమన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. విధ్వంసమైన తెలంగాణ పునర్జీవనానికి చర్యలు చేపట్టిందన్నారు. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి తెలంగాణ సాంస్కృతిక పునర్జీవానికి శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, గద్దర్ పేరిట సినిమా అవార్డులు, హైదరాబాద్ కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టం గర్వకారణమన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఫ్యూచర్ స్టేట్‌గా బ్రాండ్ చేస్తున్నామన్నారు. యువతకు పెనుసవాలుగా మారిన మాదక ద్రవ్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణలోని ప్రతి గడపకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేలా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూపాలపల్లి జిల్లాలో అనేక పనులను చేపట్టి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, ఎస్పీ కిరణ్ ఖారే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో తొలి ఇంజనీర్ విశ్వకర్మ

ప్రపంచంలోనే తొలి ఇంజనీర్ విశ్వకర్మ అని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం రచించిన వేదాల్లో విశ్వకర్మ భగవాను గురించి ప్రస్తావన ఉందన్నారు. కర్మ యోగం, శిల్పకళ, నిర్మాణ శాస్త్రం, యాంత్రిక విజ్ఞానానికి విశ్వకర్మ ఆది పితామహుడన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బెల్లయ్య నాయక్

మేడారంలో పెద్దల పండుగ


సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు



మేడారంలోని సమ్మక్క గుడిలో పూజలు చేస్తున్న పూజారులు

తాడ్వాయి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో సమ్మ క్క-సారలమ్మల పూజారులపెద్దల పండుగను బుధవారం జరుపుకున్నారు. ముందుగా వనదేవతల గుడులను శుభ్రం చేసి ఆలుకు పూతలు చేశారు. రంగురంగుల ముగ్గులు వేసి అమ్మవార్లకు దీపధూప నైవేద్యాలను సమర్పిం చారు. అదేవిధంగా గ్రామ దేవతలకు పూజలు చేశారు. అనంతరం తమ కుటుంబంలో చనిపోయిన వారిని పెద్దలకు కలపడం కార్యక్రమాలు చేసి వారి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని దేవతలను మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు, స్థానిక ఆదివాసీలు పాల్గొన్నారు.

తగ్గుముఖం పడుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద తగ్గుతున్న గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో త్రివేణి సంగమం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. బుధవారం ఉదయం 10.780 మీటర్ల ఎత్తుతో ప్రవహించింది. ఎగువ నుంచి ప్రాణహిత వరద సైతం తగ్గడంతో గోదావరి ఉధృతి తగ్గింది.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

6.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 6.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.50 మీటర్లు ఉంది.

గోదావరిలంకల్లో చిక్కుకున్న కూలీలు

జేసీబి సహాయంతో దాటించిన రైతులు

వివరాలు 6వ పేజీలో

కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఫైర్

కాటారంలో నిరసన.. మంత్రి శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మ దహనం

కాటారం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్, బీఆర్ఎస్ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు గీతాబాయి, డివిజన్ అధ్యక్షురాలు రత్న సౌజన్య, పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో కాటారంలో బుధవారం రాస్తారోకో చేశారు. పెంచికలపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆవిష్కరించడమే కాకుండా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులు హంగామా చేయడంపై నిరసన వ్యక్తమైంది. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ధన్వాడలోని మంత్రి శ్రీధర్‌బాబు ఇంటి వదకద ఆందోళనకు చేయడానికి బీఆర్ఎస్ నాయకులు వెళ్తుండగా కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్సైలు శ్రీనివాస్, రాజశేఖర్, మానస, సివిల్, టీజీఎస్పీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తో బీఆర్ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి పోలీసు వాహనాల్లో పలిమెల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వై రాష్ట్ర నేత జక్కు రాకేష్, కాటారం, మల్హర్, మహాముత్తారం, మహాదేవ పూర్, పలిమెల మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు జోడు శ్రీనివాస్, రాఘవరెడ్డి, మార్క రాము, శ్రీనివా స్‌రావు, తిరుపతి, యూత్ మండల అధ్యక్షులు రామిళ్ల కిరణ్, అనిల్, జైపాల్, హరీష్, నాయకులు ఊర వెంకటేశ్వర్‌రావు, శ్రీలక్ష్మి, జక్కు శ్రావణ్, పంతకాని సదువలి, రాజేంద్రచారి, మమత, స్వప్న, సదువలి, వెంకటస్వామి, సంతోష్, చీమల వంశీ, తాజొద్దీన్, బాపు, రాజబాపు, మనోహర్, తిరుపతి, రమణ, ఓదెలు, అశోక్, రమేష్ ఉన్నారు.



కాటారంలో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం

కాటారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి జాతీయ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా చల్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశపాలనకు చరమగీతం పాడి తెలంగాణకు విమోచనం కల్పించిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కృషి, ఎందరో వీరుల ప్రాణ త్యాగానికి విలువలేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, శ్రీశైలం, సునీల్, అంకయ్య, రాజేష్, రవి, సదానందం, అశోక్‌రెడ్డి, శివ, సారయ్య, అర్జయ్య, శ్రీనివాస్, రాజయ్య, వేణు, ఆశయ్య, రవి, లాకునాయక్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్ గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు పులిగుజ్జ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిజం నిరంకుశ పాలనలో ప్రజలు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కుల రాజు, పుట్ట బత్తుల పోశయ్య, నల్ల సుఖేందర్‌రెడ్డి, కలకొండ సమ్మిరెడ్డి , మల్లారెడ్డి, బర్ల రమేష్, వెంకన్న, మల్లయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోజన దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు చెక్క నర్సయ్య, ఏబీవీపీ నగర కన్వీనర్ ముష్కె అజయ్ జాతీయ జెండాలను ఎగురవేశారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పోరాటం, సర్దార్ పటేల్ ధీరత్వంతో నిరంకుశ పాలనకు ముగింపు లభించిందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షైదం శ్రీకాంత్, నాయకులు వెంకటరాజ వీరు, రవీందర్, గుండ సురేష్, రాజేందర్, ప్రవీణ్, సదానందం, శ్రీహరి, కత్తుల ఐలయ్య, తిరుపతి, సారంగపాణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో జాతీయ జెండాను ఎగరేస్తున్న బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో..

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు ముదురు కొల్ల భిక్షపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణాకు విమోచనం జరిగి 77 సంవత్సరాలు గడిచినప్పటికీ 56 శాతం ఉన్న బీసీలు ఒక్కరు కూడా ముఖ్యమంత్రి కాలేదన్నారు. నాలుగు శాతం ఉన్న అగ్ర వర్ణాలే ప్రాతినిధ్యం వహిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల సంతోష్, పూజారి సత్యనారాయణ, నరెడ్ల అశోక్, రామయ్య, భాస్కర్, మహేందర్, కిరణ్, వినోద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీనివాస్ (ఫైల్)

ములుగు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ములుగులోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్‌నగర్‌కు చెందిన గుగులోత్ శ్రీనివాస్ (36) కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తన కుమార్తె లావణ్యతో కలిసి గట్టమ్మ దేవాలయం వైపు వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమార్తెకు తీవ్ర గాయాలు కాగా ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

వెంకటాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా విశ్వబ్రాహ్మణులు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం నాయకులు కట్ల రాజు, శివ, పొన్నాడ శ్రీనివాస్, రామకృష్ణ, సత్యనారాయణ, బ్రహ్మం, కట్ల నర్సింహచారి, సర్వేశ్వర్‌రావు, బెజ్జంకి సత్యనారాయణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయవంతి వేడుకలను విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. విశ్వ కర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురోహితులు చీర్లవంచ రమేష్ ఆచార్యులు, వంగల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు భక్తులను ఆశీర్వదించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పోలోజు వెంకటేశ్వర్లాచారి, విజయగిరి దేవేందరాచారి, పూసల (మిగతా 8వ పేజీలో)



వెంకటాపురంలో పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు



సరైన పత్రాలు లేని వాహనాన్ని చూపుతున్న ఆర్డీవో అధికారులు

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.మహేష్‌గౌడ్, కె.సంపత్‌గౌడ్ తెలిపారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని న్యూ గాంధీ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సరైన పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ చట్టంను అనుసరించి ప్రతీ వాహనానికి నిబంధనల మేరకు పత్రాలు ఉండాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన ట్యాక్స్ చెల్లించాలని, ప్రతీ వాహనదారుడు వాహనానికి సంబంధించిన ఆర్సీ బుక్‌తో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొంది ఉండాలని, పొల్యూషన్ సర్టిఫికెట్ కలిగిఉండాలని తెలిపారు. వారి వెంట సిబ్బంది తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

స్వస్థ్‌నారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి సీతక్క

ములుగు టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకే స్వస్థ్‌నారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం బాగుంటుందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి ఇది దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా మొత్తం 65 హెల్త్ క్యాంపులతో స్వస్థ్ నారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం అధికారి రణధీర్, డెమో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

ములుగు జిల్లా కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై భోజనాలు వడ్డించారు. విశ్వకర్మ గొప్ప ఆర్కిటెక్చర్ అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని, సంఘం సభ్యులు శ్రీలమంతుల నర్సింహాచారి, కడిగంటి వీరాచారి, కాగితపు శ్రీనివాస్, కందోజు భవన్నారాయణ, మహేష్ చారి, రేసోజు శ్రీధర్, రాపాక రమేష్, కండోజు రాజేష్, అగ్గిలపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతహి సేవ ప్రోగ్రాంను ప్రారంభించిన మంత్రి

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగులోని కలెక్టరేట్ ఆవరణలో మంత్రి సీతక్క బుధవారం స్వచ్ఛత హి సేవ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ప్రత్యేక హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రంగోలి, వ్యాసరచన కార్యక్రమాలను విద్యార్థులు, మహిళా సంఘాలు, యూత్ ద్వారా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో దేవరాజ్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు

ములుగు (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ములుగులోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మేడారం అభివృద్ధి కోసం ఒకే విడతలో రూ. 150 కోట్ల నిధులతో పాటు ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్ల నిర్మాణాలను సుమారు రూ. 60 కోట్లు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే టెండర్లను ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే ములుగు పట్టణాభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 45 కోట్ల నిధులు కూడా వచ్చాయన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ రాహులశర్మతో కలిసి భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవించే మహిళల్లో రక్తహీనత ఎక్కువ ఉంటుందన్నారు. బలవర్ధక ఆహారం, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాన్ని జయించొచ్చన్నారు. రోగాలను విద్య, వైద్య రంగాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నియామకం, అవసరమైన పరికరాలు, యంత్రాలను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 2వరకు అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రసూతి, పిల్లల, నేత్ర, చేవి, ముక్కు, గొంతు, దంత, చర్మ, మానసిక వైద్య నిపుణులు శిబిరాలలో పాల్గొంటారని, మహిళలు అందరూ అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర చికిత్సకు వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉందని, వారం రోజుల్లో సిటీస్కాన్ యంత్రాన్ని ఏర్పాటు అవుతుందని తెలిపారు. అనంతరం మండలంలోని తిరుమలపురం గ్రామానికి చెందిన చెన్న చందర్‌కు రూ.1.90 లక్షల చెక్కును అందజేశారు. మండలంలోని జూకల్లు రైతువేదికలో జరిగిన పోషణ మాసోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్, ఎంపీడీవో జయశ్రీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా నాయకులు మధువంశీకృష్ణ, తిరుపతిరెడ్డి, కిష్టయ్య, కొమురయ్య, రాయకొంరు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల ఆస్పత్రిలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బెల్లయ్య నాయక్, గండ్ర సత్యనారాయణ

తీరని యూరియా వెతలు

చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కొరత బాధలు తీరడంలేదు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల వ్యాప్తంగా రోజూ 20 నుంచి 40 టన్నుల యూరియాను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా షాపుల వద్ద రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని రెండు ఎరువుల విక్రయ షాపులకు 20టన్నుల యూరియా రాగా బుధవారం తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరారు. దుకాణాల వద్ద ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



చిట్యాలలో ఎరువుల దుకాణాల ఎదుట బారులుతీరిన రైతులు

ఒడిపిలవంచలో సాయుధ పోరాట వారోత్సవాల సభ

కాటారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఒడిపిలవంచలో డీవైఎఫ్ఐ, కేవీపీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటవీరులు పుచ్చలపల్లి సుందరయ్య, చాకలి ఐలమ్మ, స్వరాజ్యం, కమలాదేవి, నారాయణరెడ్డి, కొమురయ్య, షోయబుల్లాఖాన్, షేక్ బందగీ, మొహినొద్దీన్ తదితర అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. నిజాం దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, దొరల అరాచాలకు వ్యతిరేకంగా పోరాటం జరిగిందని, 2500 మంది కమ్యూనిస్ట్ కార్యకర్తల ప్రాణత్యాగాల ఫలితమే తెలంగాణ విముక్తి జరిగిందని, చరిత్రను ఎవరైనా వక్రీకరిస్తే తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బూక్యా నవీన్, కేవీపీపీఎస్ జిల్లా నేత శ్రీధర్, వివిధ సంఘాల జిల్లా, మండల నాయకులు బంధు సుజాత, బుర్ర స్వాతి, తోట జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల జవాన్ రమేష్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ ఆరెపెల్లి రమేష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం పరామర్శించారు. జవాన్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, నాయకులు కొత్తూరి రాజిరెడ్డి, ఏరుకొండ రాజేందర్, తిరుపతి, కట్కూరి రాజేందర్, ప్రశాంత్‌రెడ్డి, కుమార్, శంకర్ తదితరులు ఉన్నారు.

వరదతో వాహనదారుల ఇబ్బందులు



విశ్వనాథపురం-తానేధార్‌పల్లి రోడ్డుపై కల్వర్టు గుండా వెళ్తున్న వరదనీరు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో మండలంలోని విశ్వనాథపురం-తానేధార్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ద్వారా వరద ఉధృతంగా ప్రవహించడంతో వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులు బుధవారం ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పంటపొలాల మీదుగా వరద రావడడంతో ఉదయం 9గంటల వరకు కల్వర్టు మీదుగా రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతి తగ్గిన తరువాత యథావిధిగా వాహనాల రాకపోకలు జరిగాయి.

షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



చరణ్

పాలకుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈ నెల 22, 23, 24 తేదీల్లో రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పాలకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్లబోయిన చరణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ జనగామ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని శివాని గురుకుల పాఠశాలలో మూడు రోజుల క్రితం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న చరణ్ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చరణ్‌ను పాఠశాల పీడీ మామిండ్ల సోమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బల రాం, వెంకన్న, అశోక్, రవి, సుమతి, శోభ అభినందించారు.

● జఫర్‌గఢ్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లి(జి) జడ్పీ హైస్కూల్‌కు చెందిన గాదె శ్రీజ షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ బాలికల విభాగంలో శ్రీజ అత్యుత్తమ ప్రతిభను కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీతారామయ్య, పీఈటీ శ్రీధర్ తెలిపారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీజ పాల్గొననున్నట్లు చెప్పారు. కాగా, బుధవారం శ్రీజను హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాంబరాజు అభినందించారు.



శ్రీజను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

యూరియా కోసం రైతుల రాస్తారోకో

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీ చేయాలని కోరుతూ రైతులు మండలంలోని శివునిపల్లి గ్రామంలో ఘన్‌పూర్-పాలకుర్తి ప్రధాన రోడ్డుపై బుధవారం రాస్తారోకో చేపట్టారు. శివునిపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంకు యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా రైతులు, రైతులు ఉదయం 6గంటల వరకే వచ్చి షాపు ఎదుట కూర్చున్నారు. యూరియా పంపిణీ చేయాలని ఆగ్రోస్ సెంటర్ యజమానికి వ్యవసాయ అధికారులు ఆదేశాలు జారీ చేయకపోవడంతో ఉదయం 6గంటల వరకే సెంటర్ వద్దకు వచ్చిన రైతులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు యూరియా కోసం నిరీక్షించారు. 7 గంటల పాటు సెంటర్ వద్ద వేచి ఉన్నప్పటికి యూరియా పంపిణీ చేపట్టకపోవడంతో ఆగ్రహానికి గురైన రైతులు ఘన్‌పూర్-శివునిపల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి యూరియా పంపిణీ చేస్తామని తెలుపడంతో రాస్తారోకోను విరమించారు. అనంతరం రైతులను క్యూలైన్‌లో నిలబెట్టి యూరియా బస్తాలను అందజేశారు. సెంటర్‌కు వచ్చిన 220 బస్తాలు ఒక్కొక్కటి పంపిణీ చేసినప్పటికి సుమారు 100 మంది రైతులు యూరియా దొరక్కపోవడంతో నిరాశతో వెళ్లిపోయారు.



ఘన్‌పూర్-పాలకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పెరిగిన గోదావరి వరద

- గోదావరిలంకల్లో చిక్కుకున్న కూలీలు
- జేసీబీ సహాయంతో దాటించిన రైతులు



కూలీలను జేసీబీ సాయంతో ఇవతలివైపు తీసుకొస్తున్న దృశ్యం

వెంకటాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో గోదావరి వరద బుధవారం క్రమంగా పెరుగుతూ ప్రవహించింది. ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వరద నీటిని కిందికి వదలడంతో బుధవారం సాయంత్రం గోదావరిపాయలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో మండలంలోని గోదావరిలంకల్లో మిర్చి పనుల కోసం వెళ్లిన సుమారు 20 మంది కూలీలు గోదావరిపాయ ఆవలివైపు చిక్కుకున్నారు. దీంతో రైతులు జేసీబీ సహాయంతో కూలీలను సురక్షితంగా దాటించారు. అదే విధంగా గోదావరిపాయ ఆవలివైపు పనుల కోసం వెళ్లిన ట్రాక్టర్లను సైతం దాటించుకుంటూ ఇవతలి ఒడ్డుకు తీసుకొచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.600 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సత్యనారాయణరావు చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పెండింగ్ బకాయిలను చెల్లించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్రం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నాగరాజు, వెంకటేష్, కుమార్, వంశీ, రాజేష్, సుమన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కాటారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్‌నగర్‌లో కాంగ్రెస్ నేతలు, కాలనీవాసులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు కృషితో అత్యవసర ప్రాధాన్యత ప్రోగ్రాం కింద గణేష్‌నగర్‌లో తాగునీటి సరఫరా కోసం ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం కోసం రూ. 49.90 లక్షలు సహా కాటారం డివిజన్‌లోని ఐదు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా కోసం బోర్లు, పైప్‌లైన్ల నిర్మాణం కోసం రూ.186.81 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ కాటారం మండలంలో పలు గ్రామాల్లో 15పనులకు రూ. 84.85లక్షలు, మల్హర్‌రావు మండలంలో 10పనులకు రూ.4.26 లక్షలు మహదేవపూర్ మండలంలో కన్నెపల్లి క్రాస్ వద్ద ట్యాంకు నిర్మాణం కోసం రూ. 42 లక్షలు, మహాముత్తారం మండలంలో 17పనులకు రూ.33.05లక్షలు, పలిమెల మండలంలో 12పనులకు రూ. 22.65లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయన్నారు. ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం, నల్లాల బిగింపు కోసం మంత్రి శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయించడంపై డివిజన్ కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు దబ్బెట రాజేషం, చీర్ల సమ్మిరెడ్డి, హరూన్ ఖాన్, తిరుపతిరెడ్డి, లచ్చిరెడ్డి కాలనీవాసులు బుర్ర వెంకటేష్, సత్తిరెడ్డి, కోటేశ్వరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణాచారి, ప్రకాశ్, శ్రీనివాస్‌రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దినోత్సవం



వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ



ములుగు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మంత్రి సీతక్క



మహబూబాబాద్‌లో తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న రాంచందర్‌నాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



హనుమకొండలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు



జనగామలోని కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేదికపై అధికారులు ←



భూపాలపల్లిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే జీఎస్సార్, అధికారులు

కేటీఆర్.. దళారీకి వంత పాడతావా!?

- రైతులకు నష్ట పరిహారం ఇప్పించిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- నిజాయితీ ఉంటే ఆ దళారీని పార్టీ నుంచి బహిష్కరించండి
- మంత్రి ధనసరి సీతక్క

ములుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిన్సియర్‌గా పనిచేస్తున్న ములుగు కలెక్టర్ దివాకరపై బీఆర్ఎస్ నాయకుడు అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, కేటీఆర్... మీ వెంట ఉంది రైతు ప్రయోజకులా... దళారులా అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన 900 మంది రైతులకు నష్ట పరిహారం ఇప్పించినందుకు కలెక్టర్ దివాకరపై ఓ దళారీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వుతారా.. అని మండిపడ్డారు.

ములుగు జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారు దళారుల చేతుల్లో మోసపోవడంతో రూ. 3.80 కోట్లు విత్తన కంపెనీల ద్వారా కలెక్టర్ రైతులకు నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. అయితే ఆ కంపెనీలో దళారిగా పని



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చేసే బీఆర్ఎస్ నాయకుడు నర్సింహమూర్తి కేటీఆర్ ముందుకు పోయి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలెక్టర్‌ను రాష్ట్రంలో ఉంచొద్దని, అందుకు తన యావదాస్తిని పార్టీకి రాసిస్తానని మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వడం సరికాదన్నారు.

ప్రైవేటు విత్తన కంపెనీ చేతుల్లో మోసపోతున్న రైతులను ఆదుకునేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండరెడ్డి, విత్తన శాఖ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకరకు బాధ్యతలను అప్పగించామన్నారు. దీంతో కలెక్టర్ కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల రైతులకు నష్ట పరిహారం ఇప్పించారన్నారు. అందుకు రైతులు కలెక్టర్‌ను గొప్పవ్యక్తిగా పొగుడుతున్నారని తెలిపారు.

దళారిగా ఉన్న వ్యక్తిని వెంటబెట్టుకుని ఆయనకు భరోసా ఇవ్వడం ఏ రైతు ప్రయోజనాల కిందకు వస్తుందో కేటీఆర్ చెప్పాలని మంత్రి అన్నారు. వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెంకు వచ్చి మరణించిన రైతు కుటుంబాలను, నష్టపోయిన రైతులను కలిసి విచారించి కలెక్టర్ తప్పు చేస్తే బహిష్కరించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నిజంగా రైతుల పట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే నర్సింహమూర్తిని బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోషకాహారంతో మెరుగైన జీవనశైలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి : మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే మెరుగైన జీవనశైలి అని, మారుతున్న జీవనశైలి మార్పుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు పోషకాహారం తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. బుధవారం ములుగులోని గిరిజన భవన్‌లో కేంద్ర సమాచారశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్, పోషణ మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈనెల 17నుంచి అక్టోబరు 16వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు,ఎత్తు పరిశీలించడం, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేసి పోషకాహారం ప్రాధాన్యత గురించి వివరించాలన్నారు. కిశోర బాలికలకు వైద్యపరీక్షలు చేపట్టాలని, తల్లిపాల ప్రాధాన్యత, కిచెన్‌గార్డెన్ ఏర్పాటు, పరిశుభ్రత పాటించడం, పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ మంత్రి సీతక్కకు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ఉత్తమమైన ఆహార ఆవశ్యకతపై వివరించారు. అనంతరం ఆమె పోషణ మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. పోషకాహారంపై ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, సీడీపీవో శిరీష, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

తెలంగాణ అమరవీరులకు నివాళి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. మంత్రి పొంగులేటి వెంట వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పొంగులేటికి స్వాగతం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నిట్ వద్ద బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు మంత్రికి పూలమొక్క అందజేశారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. బుధవారం మామునూరు పీటీసీలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంజారపు పూజ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మర్చిపోలేని ఘట్టం అని అన్నారు. అనాటి పోరాటయోధుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని కొనియాడారు. నిజాం నిరంకుశత్వం, దేశముఖ్, పటేల్, పట్వారీ వ్యవస్థల ద్వారా తెలంగాణ అణచివేతకు గురైన సందర్భంలో ఆర్య సమాజం సేవలు, కమ్యూనిస్టులు, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి మహనీయులు పోరు సాగించారని అన్నారు. నాటి రాచరిక వ్యవస్థపై పోరాడి వేలాది మంది అమరులయ్యారని, వారి త్యాగాలు మరవకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, భిక్షపతి, వెంకటేశ్వర రావు, సోమాని, డాక్టర్ సుధీర్, ఆర్ఐలు చంద్రశేఖర్, కాశీరామ్, మహేష్, నవీన్ సీఎల్ఐ అశోక్ కుమార్, దీపక్, నరేందర్, ఆర్ఎస్ఐలు రాజేష్, అనిల్ దశరథ్, అరుణ పీటీసీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎస్పీ పూజ, పోలీసులు

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- మంత్రి కొండా సురేఖ
- ఉర్సు గుట్ట వద్ద అధికారులతో సమీక్ష

కరీమాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మైసూరును తలపించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉర్సు రంగలీలా మైదానంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జీడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారని అన్నారు. వారి సౌకర్యార్థం ఉర్సు రంగలీలా మైదానంతో పాటు అన్ని ప్రాంతాల్లో మైదానాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

చదునుచేసి, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని అన్నారు. బతుకమ్మ ఆట స్థలాలను ప్రతీరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

దసరా పర్వదినం సందర్భంగా రంగలీలా మైదానంలో లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, సీటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య, ఆరోగ్యశాఖ అంబులెన్స్ సేవలు, అగ్ని మాపక శాఖ సేవలు, చెరువుల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఓ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఈ నెల 21న వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉర్సుతో పాటు నగరంలోని కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్, ప్రాంతాల్లో కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మహిళా సంఘాలచే ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బల్దియా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. వేడుకలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, వాహనాల మళ్లింపు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీసీసీ సలీమా, డీఆర్వో విజయలక్ష్మి, పోలీస్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఏసీపీ శుభం ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, పలుశాఖల అధికారులతో పాటు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో ధాన్యం కుంభకోణం

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ టెండర్లలో రూ.1100కోట్ల ధాన్యం కుంభకోణం బయటపడిందని, ఇందులో కాంగ్రెస్ పెద్దల బినామీల ప్రమేయం ఉందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని అన్నారు. ఈ కుంభకోణంపై హైకోర్టులో పిల్ (34/24) దాఖలు చేశామని పేర్కొన్నారు. న్యాయపరమైన విచారణ జరుగాలని డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ, ఏసీబీలకు 755 పేజీల సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశామని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. టెండర్ ఏజెన్సీలపై పూర్తి ఈఎండీ జప్తు చేయకుండా కేవలం రూ.65.90 కోట్లు మాత్రమే వసూలు చేశారని ఆరోపించారు. టెండర్ విలువ కంటే అదనంగా రూ.430 కోట్లు మాయమయ్యాయని ఆరోపించారు. ఈ వ్యవహారం దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా నిలుస్తుందని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అక్రమాలను కాపాడే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. నిజాలను బయటపెట్టకపోతే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

పోక్సో కేసులో నలుగురికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన నలుగురికి పోక్సో చట్టం ప్రకారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కమ్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి టి.అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు.

బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన బాలస్తి తరుణ్, అల్లం రాజులు అదే గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికకు సైగలు చేస్తూ పెళ్లి చేసుకోవాలని వేధించేవారు. ఈ విషయాన్ని నిందితుల తల్లిదండ్రులకు చెప్పగా వారి కొడుకుల చర్యలను సమర్థించారు. పైగా మీ కూతురు ప్రవర్తనే మంచిగాలేదని చెప్పారు. దీంతో బాలస్తి తరుణ్, అల్లం రాజు, వారిని సమర్థించిన అల్లం సమ్మయ్య, అల్లం ఇందిరమ్మలపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ

- మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- హాజరైన కలెక్టర్లు, ఇతర అధికారులు
- ప్రస్తావనకు వచ్చిన ఎయిర్‌పోర్టు భూసేకరణ
- స్పోర్ట్స్ స్కూల్ స్థలం, పారిశుధ్య సిబ్బంది నియామకం
- సమావేశానికి మంత్రి సురేఖ దూరం

హనుమకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ముగిసిన తర్వాత కలెక్టరేట్ రెండో అంతస్తులోని స్టేట్ చాంబర్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమీక్షించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ చర్చలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాలుపంచుకున్నారు.

భూసేకరణ

మామునూరు ఎయిర్ ఏర్పాటుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా భూసేకరణకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. విమానాశ్రయం ఏర్పాటయ్యే స్థలంలోనే ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) ఉంది. దీనిని ఎయిర్‌పోర్టుకు దూరంగా ప్రత్యామ్నాయంగా మరో ఓహెచ్ఆర్ఎస్‌ను సత్వరమే నిర్మించిన తర్వాత ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి వరంగల్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించినట్లు తెలిసింది.

స్పోర్ట్స్ స్కూల్

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ఉనికిచర్లలో గల ప్రభుత్వ భూమిలో స్పోర్ట్స్ స్కూల్, స్టేడియం నిర్మాణ విషయమై మంత్రి పొంగులేటి సంబంధిత 'కుడా' అధికారులతో చర్చించారు. ఈ స్థల సేకరణ విషయంలో 'కుడా' అధికారులు మోకాలడ్డుతున్నట్లు తెలిసింది. సుమారు 60 ఎకరాల స్థలంలో 'కుడా' వెంచర్ చేయాలని చూస్తోంది. తద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చూస్తోంది. దీంతో ఈ స్థలాన్ని ఇవ్వడానికి 'కుడా' అధికారులు ససేమిరా అంటున్నారు. ఇదే విషయమై సమావేశంలో పాల్గొన్న 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డితో మంత్రి చర్చించారు. ఈ స్థలంలో కొంత భాగం స్టేడియంకు అయినా ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. వీలైతే స్పోర్ట్స్ స్కూల్‌ను వర్ధన్నపేట నియోజవర్గ పరిధిలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి పొంగులేటి సూచించారు.

అదనంగా పారిశుధ్య సిబ్బంది

వరంగల్ నగర పాలక సంస్థలో అదనంగా 250 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించడానికి సంబంధించిన అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ ప్రతిపాదనలకు జరుగుతున్న జాప్యాన్ని మేయర్ సుధారాణి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత తర్వాత ఆమోదం తెలపాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మంత్రి సురేఖ దూరం

ఈ కీలక భేటీకి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలో అందుబాటులో ఉన్నప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, మంత్రికి మధ్య ఇటీవల చోటు చేసుకున్న మాటల యుద్ధం, కొంతకాలంగా ఎమ్మెల్యేలకు, మంత్రికి మధ్య పెరిగిన దూరం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు హాజరైనప్పటికీ మంత్రి సురేఖ రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



భూపాలపల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, ఎస్పీ కిరణ్ ఖరే



ములుగులో మాట్లాడుతున్న డీఈవో

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఆవిష్కరించారు. ప్రజా సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు చల్లూరి మధు, దేవన్, తిరుపతి, శ్రీరాములు, శ్రీనివాస్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే మునిసిపల్ కార్యాలయం లో కమిషనర్ బిర్రు శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సొసైటీ కార్యదర్శి ఆర్వీసత్య నారాయణ, విద్యుత్‌శాఖ ఏడీఏ స్వామిరెడ్డి జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, బీజేపీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నార తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో రవీంద్రనాథ్, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీపాల్, ఎఫ్‌డీవో సందీప్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్పనతోపాటు పలు రాజకీయ పార్టీలు, పలు సంఘాల జాతీయ జెండా ఆవిష్కరించారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఎంఈవో వెంకటేశ్వర్లు, వైద్యాధికారి మధుకర్, ఎస్సైలు గుర్రం కృష్ణప్రసాద్, జక్కుల సతీష్, జీపీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేశారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబు, మేడారం ఆదివాసి మ్యూజియం క్యూరేటర్ కురుసం రవి, ఎంపీడీవో సుమన వాణి జెండాను ఎగురవేశారు.

• గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిచిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాల్లో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కుమారస్వామి, ఎస్సై అమూల్య, ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు జాతీయ జెండా ఆవిష్కరించారు.

• చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్, సీఐ మల్లేష్, ఎంఈవో రఘుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి జాతీయ జెండారు ఎగురవేశారు.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఎస్పీ కిరణ్‌ఖరే, సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి డీటీవో ఎం.డి.సమ్మానీ, జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి,ఆర్డీవో రవి, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రం లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, నాయకులు సెగ్గం సిద్ధు, చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, గండ్ర హరీశ్‌రెడ్డి, పిల్లి వేణు, పోలవేణి అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై కిష్టయ్య, ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, ఏఎంసీ వద్ద చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, వ్యవసాయ శాఖ ఏవో పూర్ణిమ, ఏపీఎం రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. డీఏవో బ్రహ్మేశ్వర్‌రావు, ఎస్సై శ్రీనివాస్, ఎంపీవో వీరస్వామి, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీఈవో సతీష్, ఏఎంసీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మరెడ్డి, మాజీ ఎంపీపీ సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, కాంగ్రెస్ నాయకులు చీమల రాజు, కొట్టె శ్రీహరి, రాజేశం, లచ్చిరెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్లు అజయ్, హిమాకర్, సత్యం, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

• ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను డీఈవో సిద్ధార్థరెడ్డి ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు గందె రమేష్, ఉపాధ్యాయులు క్యాతం రాజేందర్, పిట్టల మల్లయ్య, సిరుప సతీష్ కుమార్, తోట చంద్రమౌళి, ముహమ్మద్ జాఫర్ అలీ, మదన్ మోహన్, హమీద్, గైని సతీష్, దొంతి సత్యం, భైకాని రజిత పాల్గొన్నారు.

• మంగపేట, (ఆంధ్రజ్యోతి) మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో బి.భద్రు, సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, వైద్యాధికారి స్వప్నిత, ఫారెస్టు రేంజర్ అశోక్, ఎస్సై సూరి, విద్యుత్ శాఖ ఏఈ కృష్ణారావు, ఏపీఎం శ్రీనివాస్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వీరేందర్, ఎంఈవో పి.మేనక జాతీయ జెండాను ఆవిష్కరించారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీరామ్మూర్తి, వైద్యాధికారి వినయ్‌భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రేణుక, కాంగ్రెస్ మండల మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

• గోవిందరావుపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాల్లో ఎంపీడీవో మమత, కార్మికశాఖ జిల్లా కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్దాలి నాగమణి, జెట్టి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్ సయ్యద్ సర్వర్, మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, ఎంపీడీవో విజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ముగిసిన ఎస్జీఎఫ్ఐ క్రీడా పోటీలు



జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఎంఈవో, నిర్వాహకులు

కాటారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ)మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ముగిసాయి. మూడు రోజులుగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలకు చెందిన బాలబాలికల జట్లు కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడల్లో అండర్-14, 17విభాగాల్లో పోటీ పడ్డాయి. బాలుర విభాగంలో కాటారం ఎస్టీ బాలుర గురుకులం, బాలికల విభాగంలో మేడిపల్లి ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాయి. కబడ్డీ బాలురు అండర్-14లో ఆదర్శ విద్యాలయం ప్రథమ, ఎస్టీ బాలుర గురుకులం ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17లో ఎస్టీ బాలుర గురుకులం ప్రథమ, ఆదర్శ విద్యాలయం ద్వితీయ, ఖో-ఖోలో అండర్-14లో ఆదర్శ ప్రథమ, ఎస్టీ గురుకులం ద్వితీయ, అండర్-17లో ఎస్టీ గురుకులం ప్రథమ, బీసీ గురుకులం ద్వితీయ, వాలీబాల్ అండర్-14 లో ఆదర్శ ప్రథమ, ఎస్టీ గురుకులం ద్వితీయ, అండర్-17ఎస్టీ గురుకులం ప్రథమ, బీసీ గురుకులం ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డీ బాలికలు అండర్-14లో మేడిపల్లి ఆశ్రమ పాఠశాల ప్రథమ, కస్తూర్బా విద్యాలయం ద్వితీయ, అండర్-17లో ఎస్టీ గురుకులం ప్రథమ, మేడిపల్లి పాఠశాల ద్వితీయ, వాలీబాల్ అండర్-14లో ఎస్టీ గురుకులం ప్రథమ, మేడిపల్లి పాఠశాల ద్వితీయ, అండర్-17లో ఎస్టీ బాలికల గురుకులం, మేడిపల్లి పాఠశాల, ఖో-ఖో అండర్-14లో మేడిపల్లి పాఠశాల ప్రథమ, ఎస్టీ బాలికల గురుకులం ద్వితీయ స్థానాలు సాధించాయి. కాగా గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెమొంటోలు ఆదర్శ విద్యాసంస్థల నిర్వాహకులు జనగామ కరుణాకర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో శ్రీదేవి, గురుకులాల ప్రిన్సిపాల్స్ రాజేందర్, నాగలక్ష్మి, గట్టయ్య, ఎస్జీఎఫ్ఐ జోన్ కన్వీనర్ విజయలక్ష్మి, మండల కన్వీనర్ రాధ, కో-కన్వీనర్ శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు గౌతమి, వీరన్న, మహేందర్, రమేష్, మాజీనా, శ్రీధర్, కార్తీక్, రాజేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 'స్వస్త నారీ' అభియాన్

కాటారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రిఎలు గ్రామాలకు చెందిన మహిళలు, గర్భిణీలు, బాలింతలు, యువతులకు ఆరోగ్యం, టీకాలు, పోషణ తదితర అంశాలపై ఎంపీడీవో బాబు, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక అవగాహన కల్పించారు. అక్టోబరు 2 వరకు పీహెచ్‌సీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ప్రత్యేక వైద్య శిబి రాలు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు, చికిత్సలు, మందుల పంపిణీ జరు గుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, హెచ్ఎస్ సరళ, ఎల్‌టీ సాగర్, హెచ్ఏలు నిర్మల, రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

మహదేవపూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల, పూసుకుపల్లి, యూపీఎస్ పలుగుల పాఠశాలలను డీఈవో రాజేందర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. యుడైస్, ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్, ఎండీఎం తదితర రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, కిషన్‌రెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్ఎం అన్నపూర్ణ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీధర్, శ్యాం, బాలయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

టేకుమట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయినపల్లి గ్రామంలో బుధవారం కందుల నర్సయ్యకు చెందిన దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎద్దును మంగళవారం రాత్రి ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో కట్టివేసినట్లు బాధితుడు తెలిపాడు. బుధవారం ఉదయం లేచేసరికి పక్కనే ఉన్న వరి పొలంలో ఉన్న విద్యుత్ మోటార్ వద్ద మరణించి కనిపించిందని చెప్పాడు. మోటార్ కోసం అమర్చిన విద్యుత్ వైరుకు అల్లుకున్న తీగ ఆకులను తినేందుకు ప్రయత్నించి షాక్‌కు గురై దుక్కిటెద్దు మృతి చెందిందని తెలిపాడు. దుక్కిటెద్దు విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి తనను ఆదుకోవాలని కోరాడు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

అధికారులతో మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సతక్క ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతినెలా తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించుకుని ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వందశాతం మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ ఉండేలా చూసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ ఇంకుడుగుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పారిశుధ్యంపై తగిన దృష్టి సారించాలన్నారు. నాలాల్లో పేరుకుపోయినచెత్తను తొలగించాలని, దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే ఆ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుడా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఏర్పడిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఇంజనీరింగ్ విభాగాలు తక్షణ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, వివిధశాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆశా కార్యకర్తల వినతి

ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో మంత్రి సీతక్కకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సభ్యురాలు మాధవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల పీఆర్‌సీని తక్షణమే విడుదల చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కారులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కవిత, నాగమణి, మంజుల, యశోద, సుజాత, రమాదేవి, రాణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాల అందజేత

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర గ్రామీణ సమాఖ్య సభ్యులకు ట్రాక్టర్ సహాయంతో నడిచే విత్తనాలు, ఎరువులు వేసే యంత్రాన్ని మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేష్, నీతి అయోగ్ కో ఆర్డినేటర్ రవీష్, అరుణ్, చంద్రయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా రూ.37కోట్ల10లక్షలతో ములుగు మండలంలోని ఇంచెర్ల గ్రామంలో టూరిస్ట్ ఎత్నిక్ విలేజ్ పనులు, రామప్ప ఐలాండ్ వద్ద రూ.13కోట్ల నిధులతో అభివృద్ధి పనులు, ప్రసాద్‌స్కీంలో భాగంగా రూ.61 కోట్లతో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పర్యాటక ప్రాంతమైన పాలంపేట గ్రామంలో ఇంటర్ప్రిటేషన్ సెంటర్ ఫుడ్ కోర్టులు, సావనీర్ షాప్, ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టినట్టు వివరించారు. జిల్లా ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంచర్లలో రాష్ట్ర ప్రభుత్వం 12 ఎకరాల్లో ఆయిల్ ఫ్యాక్టరీ కోసం కేఎన్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిందన్నారు. ఈఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వచ్చిన భారీ వర్షాలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండుకుని మత్తడి పోశాయని, జిల్లాలో భారీ వర్షాల వల్ల పాక్షికంగా దెబ్బతిన్న 39 ఇళ్ల యజమానులకు ఆర్థిక సాయంగా రూ.లక్షా45 వేలకుపైగా పరిహారాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 367 కుటుంబాలకు, 1,077 మందికి తాత్కాలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం నూతన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మ దినోత్సవం



పస్రాలో మోదీ జన్మదిన వేడుకల్లో నాయకులు

చిట్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, నాయకులు చెక్క నర్సయ్య, వెంకట రాజవీరు, రవీందర్, గుండ సురేష్, రాజేందర్, ప్రవీణ్, సదానందం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన మోదీ జన్మ దినోత్సవంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు, జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదీ జన్మదినోత్సవాన్ని నిర్వహించగా బీజేపీ మండల అధ్యక్షుడు టి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, ప్రధాన కార్యదర్శులు బల్ల శ్రావణ్‌కుమార్, లింగంపల్లి వంశీధర్‌రావు, కోశాధికారి ఉదారి పూర్ణచందర్, కార్యదర్శి సంతోష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఓడేటి బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్ల బుచ్చయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రాలో జరిగిన మోదీ జన్మదినోత్సవంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, నాయకులు తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, కొమురపాలెం ధర్మారావు, మద్దినేని తేజరాజు, కొత్త సుధాకర్‌రెడ్డి, పసుల బాబూరావు, సోమిరెడ్డి, ఆకుల రవీందర్, సత్యనారాయణరెడ్డి, సామ మల్లారెడ్డి పాల్గొన్నారు.

● కాటారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బందం పాగె రంజిత్‌కుమార్, బీజేపీ రాష్ట్రనేత చల్ల నారాయణరెడ్డి, జిల్లా, మండల నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, శ్రీశైలం, సునీల్, అంకయ్య, రాజేష్, రవి, సదానందం, అశోక్‌రెడ్డి, శివ, సారయ్య, అర్జయ్య, శ్రీనివాస్, రాజయ్య, వేణు, ఆశయ్య, రవి, లాకునాయక్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

వాజేడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ బలరాం నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు విడుదల చేయగా మండలంలోని చింతూరులో సీసీ రోడ్లు మంజూరు అయ్యాయి. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెంకటనర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు ప్రసాదబాబు రాజు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంధం కృష్ణ, గుడ్డెటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పర్యటన



బ్రాహ్మణపల్లిలో లక్ష్మణ్‌బాబుక స్వాగతం పలుకుతున్న మహిళలు

మంగపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సయ్య (లక్ష్మణ్‌బాబు) బుధవారం పర్యటించారు.మండలంలోని బ్రాహ్మణపల్లి పైగుంప, పెరికలకుంట, బ్రాహ్మణపల్లి, దోమేడ, రామచంద్రునిపేట తదితర గ్రామాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సందర్శించారు. పెరికలకుంటలో లక్ష్మీదేవర ఆలయ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. దోమేడలో ఆంజనేయస్వామి గుడి అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. రామచంద్రునిపేటకు చెందిన పోటూరు శ్రీకాంత్ ఇటీవల మృతి చెందగా అతడది కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. లక్ష్మీనారాయణ వెంట బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్, మహిళా విభాగం జిల్లా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారిని మంగపేటలోని గంపోనిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద లక్ష్మీనర్సయ్య సన్మానించారు.

జ్వరంతో ఒకరి మృతి

వాజేడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జ్వరంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జంగాలపల్లికి చెందిన తిమ్మాపురం రవితేజ(30)కు పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో ఆయన స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్సను తీసుకున్నాడు. జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు ఏపీలోని విజయవాడలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్సను అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి రవితేజ మృతిచెందాడు. జ్వరం ఉన్న క్రమంలో కామెర్లు కూడా వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రేటింగ్

వెంకటాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):నాణ్యమైన బోధన, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యంపై శ్రద్ధ ఇలాంటి అంశాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం రేటింగ్ ఇస్తుంది. సుమారు ఐదేళ్లక్రితం నిలిచిన ఈ పథకాన్ని ఇటీవల పునరుద్ధరించింది. జిల్లాలో 284 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 17842 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీలు స్కూళ్లలో తనిఖీలు చేసి మార్కులు కేటాయిస్తాయి. ఐదు పాయింట్లు సాధించిన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా పురస్కారాలు అందిస్తుంది. జిల్లాస్థాయిలో కలెక్టర్, డీఈవో, జిల్లా వైద్యాధికారి, డీఈ, స్వచ్ఛందసంస్థ ప్రతినిధి, ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేస్తారు. వచ్చే అక్టోబరులో ఈ కమిటీ స్కూళ్లను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తుంది. రేటింగ్ సాధించి పురస్కారాలు అందుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు గడువు ఉందని వెంకటాపూర్ మండల విద్యాశాఖ అధికారి తాళ్లపల్లి ప్రభాకర్ తెలిపారు. దరఖాస్తులను జిల్లాస్థాయిలో కమిటీ పరిశీలించి రేటింగ్ ఇస్తుందన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం అందుతుందని ఆయన వివరించారు.

పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

వాజేడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ ప్రకటించారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం పాఠశాలలో ఆ సంఘం మండల కార్యవర్గ సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా కరుటూరి సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాల సంధ్యను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్, ఎన్నికల అధికారులు పర్వతాల సతీష్ కుమార్, డి రమేష్, ఉపాధ్యాయులు దేవ కరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఇంటెలెక్చువల్స్ పోరం కో-కోఆర్డినేటర్‌గా సుధాకర్



కన్నాయిగూడెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కో-కోఆర్డినేటర్‌గా మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన గోస్కుల సుధాకర్ యాదవ్ నియామకమయ్యారు. బుధవారం జరిగిన ఉమ్మడి కరీంనగర్‌లో సదస్సులో ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, ఉమ్మడి వరంగల్ చీఫ్ కోఆర్డినేటర్ కె.వీరస్వామి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

(5వ పేజీ తరువాయి)

నాగయ్యాచారి, పూసల వెంకటస్వామి, ఆరెందుల రమేష్, శ్రీనివాసాచారి, కొత్త బట్ల సత్యనారాయణచారి, ఠాగూర్ రమేష్‌సింగ్, శ్రావణ్‌చారి, సందీప్‌చారి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కమలాపురంలో బీఎంఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. సంఘం కార్యాలయంలో గ్రామ అధ్యక్షుడు బోనగిరి యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి రామిడి సురేష్ పటేల్, యూనియన్ సీనియర్ నాయకులు వెంకటరామనర్సయ్య, యాదగిరి, సుదర్శన్, సుందర్‌రావు, గుర్రం శ్రీనివాసరావు, ఎడ్డెన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.